క్లుప్తంగా

టీటీడీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



విజయవాడ కల్చరల్: పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో శనివారం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. దాతలు దుర్గా వెంకట సుబ్బారావు, చెక్కా పుష్పలత, మణి లక్ష్మి రుషిత, వెంకట సత్యప్రసాద్, రమామణి అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవీ మాట్లాడుతూ అన్నప్రసాద వితరణ చేయాలనుకునే వారు టీటీడీ కల్యాణ మండపంలోని అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆలయంలో పద్మావతి సమేత శ్రీవెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట సెక్షన్ సిటీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ విజయ టాకీస్ రోడ్డు ఫీడర్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఆదివారం ఉదయం ఏడు నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చెరుకుపల్లివారి వీధి, మల్లాదివారి వీధి, కాళేశ్వర్‌రావు వీధి, కోదండరామిరెడ్డి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

16 పుల్ కాట్స్ పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో శనివారం పుల్ కాట్స్‌ను పారిశుధ్య సిబ్బందికి పంపిణీ చేశారు. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పుల్ కాట్స్‌ను శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను సేకరించే పుల్‌కాట్స్ పాడవ్వడంతో పారిశుద్ధ్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దీంతో తాము రూ. 80వేలతో 16 పుల్‌కాట్స్‌ను మరమ్మతులు చేయించి అందజేసినట్లు తెలిపారు. పుల్‌కాట్స్‌కు మరమ్మతులు చేయించిన గౌతంరెడ్డికి పారిశుద్ధ్య సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మందిర అధ్యక్షుడు పొన్నలూరి లక్ష్మణరావు, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రుతు సంక్రమణ వ్యాధులపై అవగాహన

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థినులు రుతు సంక్రమణ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ శైలజ సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం రుతు సంక్రమణ వ్యాధులపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు రుతు సంక్రమణ వ్యాధులు, అవి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం విద్యార్థులు ప్లకార్డులు చేతబూని ఏలూరు రోడ్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్‌కు సత్కారం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ ఎన్ఆర్ఎస్ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ నిర్మల జ్యోతి భాయ్‌ను విశ్వ ఆయుర్వేద పరిషత్ సభ్యులు అభినందించారు. శనివారం విశ్వ ఆయుర్వేద పరిషత్ సభ్యులు ప్రిన్సిపాల్‌ను కలిసి శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విశ్వ ఆయుర్వేద పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శీలం సాహితి మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర గల ఆయుర్వేద వైద్య కళాశాలకు మొదటిసారిగా ఒక మహిళను ప్రిన్సిపాల్‌గా నియమించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో విజయవాడ విభాగం అధ్యక్షుడు డాక్టర్ నల్లు ధరణి కుమార్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ షణ్ముఖ, డాక్టర్ శిరీష కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరి స్ఫూర్తితో ప్రజావ్యతిరేక పాలనపై ఉద్యమిద్దాం

వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త మల్లాది విష్ణు



టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రకేసరి, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు స్ఫూర్తితో కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనపై ఉద్యమిద్దామని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పిలుపునిచ్చారు. శనివారం తుమ్మలపల్లి కళాక్షేత్రం సమీపంలోని టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహం వద్ద ఆయన 154వ జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత టంగుటూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ అతి సామాన్య కుటుంబంలో జన్మించిన టంగుటూరి విదేశాల్లో న్యాయ విద్యనభ్యసించి న్యాయవాదిగా మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. మహాత్మాగాంధీ స్ఫూర్తితో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. సైమన్ గో బ్యాక్, క్విట్ ఇండియా, సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు పేరిట ఉద్యమం ఆయన హయాంలోనే జరిగిందని గుర్తుచేశారు. అటువంటి పోరాట యోధుడు ప్రకాశం పంతులు స్ఫూర్తితో వైఎస్ జగన్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనపై పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు.

వికలాంగుల పెన్షన్లు తీసివేయడం దుర్మార్గం

రాష్ట్రంలో పోలీస్ రాజ్యం నడుస్తోందని, భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తోందన్నారు. అధికార పార్టీ వాళ్లు ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు చేపడితే పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని, ఇదేనా పోలీసులు చేసే పని అంటూ విష్ణు ధ్వజమెత్తారు. ఒకవైపు సుపరిపాలన అని చెబుతున్న ప్రభుత్వం .. వికలాంగుల పెన్షన్లు తీసివేయడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో పూర్తిగా విఫలం అయిందని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ శర్వాణీమూర్తి, రాష్ట్ర విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ. రవిచంద్ర, రాష్ట్ర మహిళా కార్యదర్శి ఝాన్సీరాణి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి వెన్నం రత్నారావు, జిల్లా కార్యదర్శి వెంకటరామిరెడ్డి, క్లస్టర్ -1 అధ్యక్షుడు పిల్లుట్ల వంశీ, క్లస్టర్ -3 అధ్యక్షుడు పసుపులేటి యేసు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, యువజన విభాగం అధ్యక్షుడు మాత మహేష్, ఆర్‌టీఐ అధ్యక్షుడు చల్ల సుధాకర్, ఆటో విభాగం అధ్యక్షుడు పసుపులేటి కోటి, పంచాయతీ విభాగం అధ్యక్షుడు అంజిబాబు, నాయకులు యర్రగొర్ల శ్రీరాములు, దమ్మాలపాటి చంద్రశేఖర్, కాళ్ల ఆదినారాయణ, కృష్ణయ్య, దోనేపూడి శ్రీనివాస్, పులప కృష్ణ, మనోహర్, రామిరెడ్డి, ప్రేమ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి



విజయవాడ కల్చరల్: శ్రీసద్గురు సంగీత సభ నెల వారీ కార్యక్రమంలో భాగంగా లబ్బీపేటలోని సంస్థ కార్యాలయంలో శనివారం యువ రాగం పేరుతో నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి అలరించింది. యువ సంగీత విద్వాంసురాలు డాక్టర్ ప్రయాగ పూర్ణ చంద్రిక వాగ్గేయకార కీర్తనలు సరసుడా, సిద్ధి వినాయకం, రామచంద్రం, భావయామి, బ్రోచేవారెవరురా, విడజాలదురా, బంటురీతి, కందరప్ప జనక తదితర కీర్తనలను ఆలపించారు. చావలి శ్రీనివాస్ వయోలిన్‌పై, కె.జగన్మోహిని మృదంగంపై సహకరించారు. కార్యదర్శి గౌరీనాథ్ మాట్లాడుతూ యువరాగం పేరుతో యువ సంగీత విద్వాంసులకు వేదిక కల్పిస్తున్నట్లు తెలిపారు. నవంబరు 24 నుంచి 30వ తేది వరకు సద్గురు సంగీత సభ 32వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్, సంగీత విద్వాంసురాలు గాయత్రి గౌరీనాథ్ పాల్గొన్నారు.

ఘనంగా టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి



టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి రమాదేవి



చిత్తరంజన్ గ్రంథాలయంలో టంగుటూరి చిత్రపటం వద్ద నివాళి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో శనివారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి ఘనంగా నిర్వహించారు. గ్రంథాయాధికారి కె.రమాదేవి టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో టంగుటూరికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఆయన యావదాస్తిని దేశ సేవకే ఖర్చు చేశారని తెలిపారు. క్విట్ ఇండియా ఉద్యమంలో జైలు జీవితం గడిపారన్నారు. బ్రిటిష్ తూటాలకు ఎదురొడ్డి నిలిచిన సాహసి అని కొనియాడారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు. గ్రంథాలయ అధికారి కె.వి.ఆర్.ఎస్. ప్రసాద్ టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డి మృతి తీరని లోటు

సీపీఐ జాతీయ సమితి కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ



సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జాతీయ సమితి కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ అన్నారు. శనివారం విజయవాడ హనుమాన్‌పేటలోని దాసరి భవన్‌లో సురవరం సుధాకర్‌రెడ్డి సంతాప సభ జరిగింది. తొలుత సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో వనజ మాట్లాడుతూ నిజాయితీ, క్రమశిక్షణ, నిబద్ధతకు నిలువుటద్దం సురవరం అని కొనియాడారు. జాతీయ స్థాయిలో పార్టీ ప్రధాన కార్యదర్శి అవడం గర్వకారణం అన్నారు. సురవరం ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజాకవి తెలంగాణా సాయుధ పోరాట యోధులు సురవరం ప్రతాపరెడ్డికి స్వయానా తమ్ముడు కుమారుడు అని తెలిపారు. ఆయన భౌతిక దేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనల నిమిత్తం గాంధీ ఆసుపత్రికి అప్పగించడం గర్వకారణమని పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమానికి సుధాకర రెడ్డి చేసిన సేవలు అజరామరం అన్నారు. నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు మోతుకూరి వెంకటేశ్వరరావు, నగర సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు, నగర నాయకులు బుట్టి రాయప్ప, తూనం వీరయ్య, కొండేటి శ్రీనివాసరావు, జి.వి.రాజు, మోతుకూరి అరుణకుమార్, నక్క రాజ్యలక్ష్మి, కొల్లిపాక శేషు, కల్లేపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిసా పురస్కారాలు ప్రదానం



థెరిసా పురస్కారాల సభలో కొల్లూరి, నన్నపనేని రాజకుమారి తదితరులు

విజయవాడ కల్చరల్: నగరానికి చెందిన ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ గాంధీనగర్‌లోని హనుమంతరాయా గ్రంథాలయంలో మదర్ థెరిసా స్మారక పురస్కారాలను శనివారం ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి మాట్లాడుతూ మదర్ థెరిసా సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. టీడీపీ నాయకురాలు నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ థెరిసా సేవలకు గానూ భారతరత్న పురస్కారం లభించినట్లు గుర్తుచేశారు. వివిధ రంగాలకు చెందిన 26 మందికి మదర్ థెరిసా అవార్డులను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా డాక్టర్ నల్లి మనోజ్ఞ, మల్లికార్జున విద్యా సంస్థల చిన్నారులు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమాన్ని సంస్థ ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు, కోశాధికారి సీహెచ్ వి.సుబ్బయ్య నిర్వహించారు. వివిధ రంగాలకు చెందిన నెట్టం రఘురాం, రావి కృష్ణారావు, నూకల వెంకట సాంబశివరావు, గుత్తికొండ కొండలరావు, పీవీ దుర్గారాణి తదితరులు పాల్గొన్నారు.

మధురంగా సాగిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: హిమబిందు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై శనివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. నగరానికి చెందిన పలువురు గాయకులు మల్లాది స్వాతి, కొప్పుల ఆనంద్, రేష్మ, కవిత, శైలజ, శ్రీనివసరావులు చిరంజీవి చిత్రాల్లోని పాటలను ఆలపించారు. విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్ రాజు మాట్లాడుతూ గాయకులు స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. చింతకాయల చిట్టిబాబు, పరుచూరి విజయలక్ష్మి, జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్, బి. వీరభద్రరావు పాల్గొన్నారు. గాయని కంచి మల్లీశ్వరిని అతిథులు ఆత్మీయంగా సత్కరించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

మధురానగర్(విజయవాడసెంట్రల్): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ బుంగ రవికుమార్ అన్నారు. చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్ భవన్‌లో శనివారం టెలికాం రీక్రియేషన్ క్లబ్‌లో ఎస్.అంజారావు మెమోరియల్ ఎన్టీఆర్ జిల్లా ప్రథమ క్యారమ్ ర్యాంకింగ్ పోటీలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన కృష్ణా జిల్లా జనరల్ మేనేజర్ మురళీకృష్ణతో కలిసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం బిజీగా ఉండే ఉద్యోగులకు క్రీడల వల్ల వత్తిడి తగ్గుతుందని అన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.కోటేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా క్యారమ్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వేణుగోపాల్, కె.హరిబాబు, మురళీకృష్ణ, సీనియర్ క్రీడాకారులు, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు పాల్గొన్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతగా ఎస్.కె. అబ్బుతుల్లా వ్యవహరించారు.

మధుర స్వరాల సంగీత దర్శకుడు రాజ్‌కుమార్

విజయవాడ కల్చరల్: మధుర స్వరాల సినీ సంగీత దర్శకుడు ఎస్.ఎ. రాజ్‌కుమార్ అని కళాపోషకుడు బి. వీరభద్రరావు అన్నారు. డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కళావేదికపై శనివారం సినీ సంగీత దర్శకుడు ఎస్.ఎ. రాజ్‌కుమార్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. వీరభద్రరావు మాట్లాడుతూ ఆయన సంగీత దర్శకత్వం వహించిన పాటలు ప్రేక్షకులను అలరించాయని తెలిపారు. గాయకులు చావా నరసింహారావు, అమలారాణి, సత్యవర్ధన్, సాంబశివరావు, లక్షణ్ నాయక్, శిరీష, మల్లీశ్వరి సినీ గీతాలను ఆలపించారు. చిట్టిబాబు, డేవిడ్‌రాజు, హైదరాబాద్‌కు చెందిన తొట్టెంపూడి రమేష్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పారదర్శకంగా చేయాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డీఎస్సీ అభ్యర్థుల ఎంపికలో వ్యాయామ ఉపాధ్యాయులకు సంబంధించి ఫిజికల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పారదర్శకంగా నిర్వహించాలని ఏపీ వ్యాయామ పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవేంద్ర గౌడ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్లు ప్రత్యేకంగా వెరిఫై చేయాలని కోరారు. అభ్యర్థుల ఎంపికలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో కొన్ని వర్సిటీలు డబ్బులు తీసుకుని మెమోలు జారీ చేస్తున్నాయని ఆరోపించారు.

మహిళల హక్కుల రక్షణకు ఉద్యమిద్దాం

పీఓడబ్ల్యూ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళల హక్కుల రక్షణకు ఉద్యమించాలని స్త్రీ వాద రచయిత్రి పి. సత్యవతి పిలుపునిచ్చారు. '79 ఏళ్ల స్వాతంత్ర్యం - స్త్రీ సాధికారత' అనే అంశంపై శనివారం పీఓడబ్ల్యూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన ప్రెస్‌క్లబ్‌లో సభ జరిగింది. సభలో సత్యవతి మాట్లాడుతూ మహిళలు పోరాడి సాధించుకున్న హక్కుల అమలుకు మరోసారి పోరాడాల్సి వస్తోందని పేర్కొన్నారు. కుటుంబాలను కూలదోసి, పేదల జీవితాన్ని ఛిద్రం చేసే మద్యాన్ని ప్రభుత్వం ప్రధాన ఆదాయ వనరుగా చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. సదస్సులో పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగాభవాని, సహాయ కార్యదర్శి పి. పద్మ, ఉపాధ్యక్షులు ఎస్. విష్ణు, రాష్ట్ర సహాయ కార్యదర్శి వెట్టి భారతి, కోశాధికారి ఎస్.భారతి తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామివారికి శనివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారి చెంత దిష్టి నివారణకు గుమ్మడికాయలు ఉంచి పూజలు చేశారు. పూజల అనంతరం భక్తులకు గుమ్మడికాయలు పంపిణీ చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

బీజేపీ ప్రోగ్రామ్స్ అండ్ ప్రోటోకాల్ ఇన్‌చార్జ్‌గా నాగభూషణం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బీజేపీ రాష్ట్ర ప్రోగ్రామ్స్ అండ్ ప్రోటోకాల్ ఇన్‌ఛార్జ్‌గా ఆ పార్టీ సీనియర్ నేత పాతూరి నాగభూషణం నియమితులయ్యారు. పాతూరి నాగభూషణం గతంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా, రాష్ట్ర కార్యదర్శిగా, రాష్ట్ర మీడియా ఇన్‌చార్జిగా పనిచేశారు. తనను నియమించిన అధిష్టానానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే బొండా ఇంటి ముందు పొంగుతున్న డ్రెయినేజీ



నిమ్మతోట సెంటర్‌లో ఉమా ఇంటి వద్ద రోడ్డుపై మ్యాన్‌హోల్ నుంచి వస్తున్న మురుగునీరు



ఆ రోడ్డులోని ఆస్పత్రి ఎదుట డ్రెయినేజీ నీరు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): స్థానిక నిమ్మతోట సెంటర్‌లోని ఆస్పత్రి రోడ్డు మొదట్లో (సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమా ముందు) ఉన్న భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు బయటకు వచ్చి రోడ్డుపై ప్రవహిస్తోంది. ఈ రోడ్డులో ఆస్పత్రితోపాటు ప్రైవేటు కళాశాలలు, కార్యాలయాలు ఉండటంతో ఈ నీటిలో నుంచే విద్యార్థులు, వాహనచోదకులు రాకపోకలు సాగిస్తున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు



ఎస్ఆర్ఆర్‌లో అధ్యాపకులు, విద్యార్థుల ప్రతిజ్ఞ

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సూచించారు. శనివారం పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వర్షాకాలంలో వ్యాధులు రాకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, నీటినిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. శానిటరీ సిబ్బంది డ్రెయినేజీల్లో నీరు పారుదలకు చర్యలు తీసుకోవాలని, ఇళ్ల మధ్య చెత్తకుప్పలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మానవహారం నిర్వహించారు. జోనల్ కమిషనర్ ప్రభుదాస్, ఏఎంహెచ్‌ఓ బాబు శ్రీనివాసరావు, హైస్కూల్ ఉపాధ్యాయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. కళాశాలలో శనివారం 'స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందన్నారు. వ్యాయామ విద్య విభాగాధిపతి యుగంధర్ వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం 'స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ' చేశారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై జిల్లాస్థాయి క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల విజేతలతో నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థుల్లో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించేందుకు గానూ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన హెచ్ఐవీ ఎయిడ్స్‌పై శనివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీల్లో ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల, ఆంధ్ర లయోల కళాశాల, పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల, సిద్ధార్థ జూనియర్ కళాశాల, మేరీస్ స్టెల్లా కళాశాల, శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమీ, నారాయణ జూనియర్ కళాశాల, వికాస్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఆంధ్ర లయోలా కళాశాలకు చెందిన డారెన్, ఫయాజ్ ప్రథమ స్థానం, నారాయణ జూనియర్ కళాశాలకు చెందిన కె.జాహ్నవి నాగతేజ, ఎస్.చర్మిష్ఠ ద్వితీయ స్థానం, శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమీకు చెందిన ఎం.పూజ, సాయి ప్రసన్న తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ. 5వేలు, ద్వితీయ బహుమతి రూ. 4వేలు, తృతీయ బహుమతి రూ. 3వేలు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా త్వరలో అందజేయనున్నట్లు జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ భానూనాయక్ తెలిపారు. అలాగే ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను ఈనెల 26వ తేదీన కేఎల్‌యూలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ పోగ్రామ్ మేనేజర్ డాక్టర్ శ్యాంసన్, శ్రీవిద్య, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ స్పేస్ దినోత్సవం



సైన్స్ పరిశోధనలను వివరిస్తున్న స్కై వాచర్స్, ఆప్ కాస్ట్ ప్రతినిధులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆప్ కాస్ట్, స్కై వాచర్స్ విజయవాడ ఆధ్వర్యంలో జాతీయ స్పేస్ దినోత్సవాన్ని సింగ్‌నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. స్కై వాచర్స్ ప్రతినిధి ఉమా, ఆప్ కాస్ట్ కోఆర్డినేటర్ మైనం హుస్సేన్‌లు పాల్గొని టెలిస్కోప్‌ను ప్రదర్శించి ఆకాశంలో గ్రహాలను ఏ విధంగా వీక్షించవచ్చు.. ఆర్యభట్ట మొదలుకొని చంద్రయాన్-1, చంద్రయాన్-3, మంగళయాన్ పరిశోధనల వరకు విద్యార్థులకు వివరించారు. ఇటువంటి కార్యక్రమాలు శాస్త్ర, సాంకేతిక వైజ్ఞానిక పరిశోధనల పట్ల విద్యార్థులు ఆసక్తి పెంచుకొని ఆ దిశగా పయనించేందుకు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు రవిబాబు, ప్రకాష్, షేక్ సైదా సాహెబ్, పావని, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.